క్లుప్తంగా

కెరీర్ గైడెన్స్‌పై కౌన్సెలింగ్

కంబాలచెరువు: స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ కౌన్సెలింగ్ సెల్, జువాలజీ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై కౌన్సెలింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రా యూనివర్సిటీ ఎఎస్‌డీసీ అడ్మినిస్ట్రేటర్ అండ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.ఫణిప్రకాష్ మాట్లాడుతూ ఆక్వా కల్చర్‌కి సంబంధించిన ఉద్యోగాలు, అవసరమైన స్కిల్స్ గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కెరీర్ గైడెన్స్ సెల్ కో ఆర్డినేటర్ వీర్రాజు, సూరిబాబు, మౌనిక, మహమ్మద్, భువనేశ్వరి, శివరంజని, సీహెచ్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

ప్రకాశం నగర్: ఇటీవల కాకినాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి పి.విజయ్, విద్యార్థిని వి.వేంకట కిరణ్మయిలు సత్తా చాటి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్‌కే రామచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ఎం.ప్రసాద్, పీవీవీ లక్ష్మి, టి.విజయ్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విజేతలను అభినందించారన్నారు.

దైవీ శక్తుల విజయమే దేవీ భాగవతం



ప్రవచనకర్త చాగంటి మాలతిని సత్కరిస్తున్న మండలి సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: ఆసురీ శక్తులపై దైవీ శక్తుల విజయమే దేవీ భాగవతం అని ప్రముఖ ప్రవచన కర్త చాగంటి మాలతి అన్నారు. మంగళవారం టీనగర్‌లోని బిందుమాధవ కమ్యూనిటీ హాలులో జరిగిన శ్రీకరీ లలితా మండలి వార్షికోత్సవ సభలో ఆమె దేవీ భాగవతంపై ప్రసంగించారు. మానవుడు తనలోని అరిషడ్వర్గాలను జయించాలని దేవీ భాగవతం మనకు సందేశం ఇస్తుందన్నారు. అజ్ఞాతంగా మనుషులను శాసిస్తున్న జగన్మాతను నవరాత్రుల్లో కొలవడం అందరి కర్తవ్యమన్నారు. అనంతరం ప్రవచనకర్త మాలతిని సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకురాలు గ్రంధి విజయలక్ష్మి, గ్రంధి రంగారావు, విజయదుర్గ, కె.రమా లక్ష్మి, బెహరా ఉమ, సుమలత, నాగ శిరీష తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం డివిజన్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఆర్డీఓ కేఎస్ శివజ్యోతి నేతృత్వంలోని కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ శివజ్యోతి మాట్లాడుతూ రాజమండ్రి అర్బన్, కోరుకొండ, రంగంపేట, రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించామన్నారు. మూడు అంగన్‌వాడీ వర్కర్ల పోస్టుల కోసం 15 మంది, 33 అంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు 93 మంది, ఒక మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు ఇద్దరు ఇంటర్వ్యూకు హాజరయ్యారన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.విజయకుమారి మాట్లాడుతూ గురువారం కొవ్వూరు డివిజన్ పరిధిలో పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఇంటర్వ్యూ కమిటీ సభ్యులు డీఎంహెచ్ఓ డాక్టర్ సుధాకర్, సంబంధిత సీడీపీఓలు హాజరయ్యారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

కంబాలచెరువు: మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు లాక్కుని పారిపోయిన సంఘటన మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. కొంతమూరుకు చెందిన చింతలపూడి నూకరత్నం వై.జంక్షన్ వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అటెండర్‌గా పనిచేస్తుంది. సాయంత్రం విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా సరిగ్గా బిజిలీ ఐస్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చేసరికి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలో గొలుసు లాక్కుని పారిపోయారు. దీనిపై నూకరత్నం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తా

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాల్లో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి అన్నారు. మంగళవారం హుకుంపేట గ్రామ పంచాయతీ ఆవరణలో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వరలక్ష్మీకాలనీలో పార్కును అభివృద్ధి చేయాలని, ఒడియాపేట వాసులకు ఇళ్ల లేక ఇబ్బందులు పడుతున్నామని, గోదావరి పెరిగితే సావిత్రినగర్ మునిగిపోతుందని ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరిని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కేఎస్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి గుంట్రు వెంకటరావు, దుద్దుపూడి రామకృష్ణ, పెంద్యాల రామకృష్ణ, పంతం నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు వేగవంతం

- నేతాజీ నగర్‌కు తీరనున్న ముంపు సమస్య
- ఆవ కాలువలో పూడికలు తీసేందుకు తొలగిన ఇబ్బందులు



బొమ్మూరు వెంకటేశ్వరనగర్‌లో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామంలో ఆవ కాలువ వెంబడి ఆక్రమణల తొలగింపు పనులు వేగవంతం చేశారు. దీంతో గ్రామంలోని నేతాజీనగర్ ప్రాంతంలో ముంపు సమస్యకు చెక్ పడనుంది. రాజమహేంద్రవరం నగరం నుంచి వచ్చే మురుగునీరు, వర్షపునీరు ఎస్‌టీపీ ప్లాంట్ నుంచి హుకుంపేట, బొమ్మూరు ఆవ కాలువ మీదుగా ధవళేశ్వరం గ్రామంలోని సాయిబాబా గుడి వద్ద నుంచి గోదావరిలో కలుస్తుంది. గోదావరికి వరద ఉధృతంగా వచ్చిన సమయంలో అక్కడ గేటు పడిపోవడంతో నీరు వెనక్కి వచ్చి బొమ్మూరు నేతాజీనగర్, హుకుంపేట, సావిత్రినగర్, ఆదర్శనగర్ ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి.

కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారులు

ఇటీవల కలెక్టర్ ప్రశాంతి ఆవ కాలువను పరిశీలించి హుకుంపేట, బొమ్మూరు, ధవళేశ్వరం గ్రామాల్లోని ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో భవన యజమానులకు నోటీసులు జారీచేసి హుకుంపేట ఆవ కాలువ ప్రాంతంలో ఆక్రమణలు తొలగించారు. బొమ్మూరు గ్రామంలో సోమ, మంగళవారాల్లో ఆక్రమణల తొలగింపును వేగవంతం చేశారు. నేతాజీనగర్, నవభారత్‌నగర్ ప్రాంతాల్లో ఎంపీడీవో డి.శ్రీనివాసరావు నేతృత్వంలో ఆక్రమణల తొలగింపు సాగుతోంది. పంచాయతీ ఈఓ శ్రీనివాసరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వీఆర్‌వోల పర్యవేక్షిస్తున్నారు. నేషనల్ హైవే నుంచి బొమ్మూరు వెంకటేశ్వరనగర్ మీదుగా బాలాజీపేటకు వెళ్లే కాలువపై ఉన్న ఆక్రమణలతో పాటు ఆవ కాలువ వద్ద పంచాయతీ స్థలంలో ఉన్న సెంటెక్స్, గురుకులం పాఠశాలలకు చెందిన ప్రహరీలను సైతం జేసీబీతో తొలగించారు. ఆక్రమణల తొలగింపు వల్ల వర్షాకాలం ముందు సమయంలో కాలువలోని పూడికలు తీసేందుకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని, ప్రజలకు ముంపు సమస్య ఉండదని అధికారులు చెబుతున్నారు.

అడ్డంకిగా మారిన విద్యుత్ స్తంభాలు

బొమ్మూరు నేతాజీనగర్ తదితర ప్రాంతాల్లో ఆవ కాలువపై విద్యుత్ స్తంభాలు ఉండడంతో ఆక్రమణల తొలగింపుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆక్రమణల స్థలంలోనే విద్యుత్ స్తంభాలు ఉండడంతో వాటిని సైతం మార్పు చేయాల్సిన అవసరం ఉంది. విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే విద్యుత్ స్తంభాలు మారిస్తే తప్ప ఆక్రమణలు తొలగించినా ప్రయోజనం ఉండదని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలు మార్పు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ గిరి బాధ్యతల స్వీకరణ



ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా బాధ్యతలు స్వీకరిస్తున్న బీవీ గిరి

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బీవీ గిరి సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆయన పాలకొల్లు ఏపీఎంఐఎస్ డీసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న డి.బాలశంకరరావు ఒంగోలుకు బదిలీ అయిన విషయం తెలిసిందే. మంగళవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈఈ గిరి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ముందుకు తీసుకెళుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తానన్నారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జైబాబు తదితరులు

సీటీఆర్ఐ: ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని సోషలిస్ట్ జనతా కాంగ్రెస్ కూటమి జాతీయ అధ్యక్షుడు ఎల్.జైబాబు డిమాండ్ చేశారు. సోమవారం రాజమహేంద్రవరంలోని అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేల ఏళ్లుగా దళిత, గిరిజన, వెనకబడిన కులాలకు చెందిన ప్రజలు, మైనార్టీలు అణిచివేతకు గురయ్యారన్నారు. అణచివేతకు గురైన ప్రజలందరూ ఆధిపత్య కులాల ప్రజలతో సమానంగా అభివృద్ధి చెందాలని అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లు పొందుపరిచారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గోరింత అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రాయితీలు పొందుతున్న ప్రైవేట్ పారిశ్రామికవేత్తలందరూ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హ్యూమన్ రైట్స్ ప్రొడక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఎస్సీ సెల్ చైర్మన్ కండవల్లి లక్ష్మి, ఏపీ జేఏసీ సంఘాల కన్వీనర్ జేటీ రామారావు, జి.లక్ష్మణరావు, జి.భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



రాజవోలులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి భీమరాజు

రాజమహేంద్రవరం రూరల్: వ్యవసాయ అనుబంధ శాఖల పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజమండ్రి రూరల్ మండల వ్యవసాయ అధికారి భీమరాజు అన్నారు. హుకుంపేట, రాజవోలు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి భీమరాజు మాట్లాడుతూ ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రైతులకు వ్యవసాయంలో ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పద్ధతులను తెలియజేయడం ద్వారా నాణ్యమైన దిగుబడులు పొందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. పంట దిగుబడులు తగ్గడానికి కారణాలు తెలుసుకుని, సూక్ష్మ పోషక లోపాలు గుర్తించి తద్వారా భూసారాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రైతులకు కౌలు కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ అధికారి వెంకట్రావు మాట్లాడుతూ సకాలంలో దూడలకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు మౌని, మాజీ సర్పంచ్ నిమ్మలపూడి రామకృష్ణ, ఏఈఓ జాన్ పీటర్, వీఏఏ దుర్గాబాబు, మత్స్య శాఖ సహాయకులు సంధ్య, మార్కెటింగ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఐ దిలీప్‌కుమార్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల సందర్భంగా స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బయట చిరుతిళ్లకు ఎక్కువగా అలవాటు పడుతున్నారని, వాటిలో వాడే రకరకాల రసాయనాలు ఆరోగ్యానికి చేటు చేస్తాయన్నారు. విద్యార్థులు జంక్ ఫుడ్స్ ఎక్కువ తినడం వల్ల భవిష్యత్తులో తీవ్ర అనారోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. బాలల హక్కులు, బాల్యవివాహాలు, పోక్సో చట్టంపై ప్రతిఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మండల స్థాయిలో జరిగిన చిత్రలేఖన పోటీకి 20 మంది, వ్యాసరచన పోటీకి 21 మంది హాజరైనట్టు దిలీప్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంవీఎం సుబ్రహ్మణ్యం, చిత్రలేఖన ఉపాధ్యాయుడు డాక్టర్ పుప్పాల బాపిరాజు, ఉపాధ్యాయుడు వరహాలగిరి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దుళ్ల యువకుడి మృతి



సీతారామరాజు (ఫైల్)

కడియం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జొన్నాడ సెంటర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కడియం మండలం దుళ్లకు చెందిన వేగిరాజు సీతారామరాజు(36) మృత్యువాత పడ్డాడు. ఆయనకు భార్య కోటీశ్వరి, కొడుకు షణ్ముఖ చైతన్య(12), కుమార్తె సాయికృష్ణ తేజస్విని(8) ఉన్నారు. సీతారామరాజు తండ్రి సాల్మన్‌రాజు డయాలసిస్ పేషెంట్. రాజు మృతితో కుటుంబసభ్యులంతా కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. స్థానికంగా వెల్డింగ్ చేసుకుంటూ జీవించే రాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో దుళ్లలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు సీతారామరాజు కుటుంబాన్ని రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పరామర్శించారు. రాజు తండ్రి సాల్మన్‌రాజుకి ధైర్యం చెప్పి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ గురప్రు కొండయ్య మాస్టారు, ముమ్మిడి దేవి నాగేశ్వరరావు, కంటిపూడి శ్రీనివాస్, కాయల సత్యనారాయణ, గోపి ప్రసాద్, రాజు తదితరులు ఉన్నారు.

గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలి

సినీ డైరెక్టర్, నటుడు కాశీవిశ్వనాథ్



రఘుదేవపురం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటుడు కాశీవిశ్వనాథ్

సీతానగరం: వినాయకుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని సినీ నటుడు, డైరెక్టర్ వై.కాశీవిశ్వనాథ్ కోరారు. మంగళవారం రఘుదేవపురం వినాయకుని ఆలయం చెరువు గట్టు సమీపంలో గణపతి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెలు, పట్టణాల్లో గణనాథుని విగ్రహాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. నేటి యువత చెడు మార్గాల్లో కాకుండా మంచి మార్గంలో పయనించడం ఎంతో హర్షనీయమని ఆయన అన్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. సుమారు నాలుగువేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ వారు యలమాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ప్రిన్సిపాల్ రామచంద్ర తదితరులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు శిక్షణనిచ్చారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ వలంటీర్లకు సామాజిక సేవాతత్పరత ఉండాలన్నారు. సమాజసేవలో మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. అనంతరం ఫైనల్ ఇయర్ విద్యార్థులకు, ఉత్తమ వలంటీర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో జె.జాకొబ్, డాక్టర్ జె.సురేష్, కె.బాబు, డాక్టర్ త్రినాథ్, డాక్టర్ యూసఫ్ బాషా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ భవాని, డాక్టర్ బి.మురళీకృష్ణ, కె.గనిరాజు, కె.సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్ సంస్థ నిలువునా ముంచేసింది

సీటీఆర్ఐ: ఐఏఎస్ అనే సంస్థ తమను నిలువునా ముంచేసిందని రాజమహేంద్రవరానికి చెందిన చింతపల్లి గౌతమ్, మణికంఠలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారిద్దరూ మాట్లాడుతూ యూట్యూబ్‌లో వచ్చే వీడియోలు చూసి లైక్ కొడితే రోజూ డబ్బులు తమ ఖాతాల్లో పడతాయని చెబితే చాలామంది నిరుద్యోగులు సంస్థ యాజమాన్యం మాటలు నమ్మి వేలాది రూపాయలు డబ్బులు కట్టి మోసపోయారన్నారు. ఒక్కొక్కరూ రూ.2 వేల నుంచి రూ.18 వేల వరకూ సుమారు 500 మందికి పైగానే చెల్లించి పోగొట్టుకున్నారన్నారు. ఆ సంస్థ నగరంలో పలుకు, అమ్మానాన్న సేవాశ్రమం, గౌతమీ జీవకారుణ్య సంఘం వంటి సంస్థల్లో అనాథలు, వృద్ధులు, వికలాంగులకు చీరలు, మందులు, బ్యాగులు కూడా పంపిణీ చేశారన్నారు. గౌతమీ జీవకారుణ్య సంఘంలో జరిగిన కార్యక్రమంలో సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తమ విజ్ఞప్తి మేరకు పాల్గొన్నారన్నారు. సంస్థ డబ్బులు కట్టించుకుని మోసం చేసి విషయం తెలుసుకుని ఆయన దృష్టికి తీసుకుని వెళ్లామన్నారు. బయటి వ్యక్తులు చాలా మంది డబ్బులు కడితే సంస్థ ప్రతినిధి అప్పలరెడ్డి మోసం చేశారన్నారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో గోపి, సాయి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీలార్ల బదిలీలు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికల అనంతరం పరిపాలనా సౌలభ్యంలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న బదిలీలలో నియోజకవర్గంలో రెవెన్యూ శాఖలో జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి బదిలీలు చేశారు. రాజానగరం మండల డిప్యూటీ తహసీల్దార్‌గా కె. సుధాకరరావు వై.రామవరం మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. అలాగే రాజమహేంద్రవరం యూనిట్-1లో ఎలక్షన్ డీటీగా ఉన్న ఎ.కుమారిని స్పెషల్ డీటీగా రాజానగరం మండలానికి బదిలీ చేశారు. రాజమహేంద్రవరం అర్బన్ మండలం నుంచి డి.సాయిరామ్‌ను కోరుకొండ మండలానికి డీటీగా, గోకవరం మండలంలో రీసర్వే డీటీగా ఉన్న ఎ.రజనీని కోరుకొండ మండలానికి డీటీగా బదిలీ చేశారు. వీరిద్దరిలో ఒకరు ఎలక్షన్ డీటీగా విధులు నిర్వర్తిస్తారు. సీతానగరం మండలంలో రీసర్వే విభాగంలో డిప్యూటీ తహసీల్దారుగా ఉన్న పి.సర్వేశ్వరమూర్తిని అదే మండలానికి డీటీగా నియమించారు.

కాతేరులో బీజేపీ సభ్యత్వ నమోదు



కాతేరులో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలోని కాతేరు ఎస్సీ కాలనీలో విప్పర్తి జ్యోతి ఇంటి దగ్గర నుంచి బీజేపీ సదస్యత అభియాన్ (సభ్యత్వ నమోదు) కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. రూరల్ నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్ యానాపు ఏసు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొల్లి వెంకట నరసింహరావు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు సాగింది. ఈ సందర్భంగా నరసింహరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం కింద మహిళలకు గ్యాస్ కనెక్షన్లు, వితంతువులకు నెలకు 30 కిలోల బియ్యం, బడుగు బలహీన వర్గాలకు ఉపయోగపడే అనేక పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. యానాపు ఏసు మాట్లాడుతూ 8800 00 2024 నంబర్‌కి మిస్డ్ కాల్ ఇచ్చి సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీవీ రామారావు, ఆకుల నారసవేణి, విప్పర్తి జ్యోతి, జాలిమే రత్నం, అక్కబత్తుల గంగమ్మ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు విద్యార్థుల ఎంపిక



జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పెదపూడి: అనపర్తిలో జీబీఆర్ పాఠశాలలకు చెందిన 11 మంది విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికైయ్యారని జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి ఆదిరెడ్డి తెలిపారు. ఆ పాఠశాల్లో విద్యార్థులను యాజమాన్యం, పాఠశాల ఉపాధ్యాయ బృందం మంగళవారం అభినందించారు. ఆదిరెడ్డి మాట్లాడుతూ అండర్-14 విభాగంలో కె.విదీప్ శిరీష్‌రెడ్డి (బ్యాడ్మింటన్), అమృత ప్రిన్సెస్ (షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో) ఎ.హాసిని (షాట్‌పుట్) జి.హాసిత (ఖోఖో) క్రీడా విభాగాల్లో ఎంపికైయ్యారన్నారు. అలాగే అండర్-17 టీ.దీపక్‌ఎస్.ఎస్.రెడ్డి (చెస్), కె.గిరిజాదుర్గాప్రసాద్ (ఖోఖో), డి.అఖిల్ (బ్యాడ్మింటన్), ఎం.డీ.ఎస్.ప్రణీత కళ్యాణి (డిస్కస్‌త్రో, షాట్ పుట్), పి.అమృత (రన్నింగ్), పీ.ఎస్.ఎస్.ఎల్.వాణి 'షాట్‌పుట్), వి.మైటీ (ఖోఖో) క్రీడా విభాగాల్లో ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో యాజమాన్య సభ్యులు గొలుగూరి రామారెడ్డి, గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ జి.హరిప్రసాద్, ఉన్నత పాఠశాల హెచ్ఎం సీహెచ్ రామారావు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.భువనేశ్వరి, ప్రీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం జి.కామాక్షి, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఇన్‌చార్జి మహీంద్రా, ఏఓ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనతో అధిక దిగుబడి

వ్యవసాయశాఖ కాకినాడ ఏడీఏ ఎం.రత్న ప్రశాంతి



కరకుదురులో రైతులకు ఎలుకల నిర్మూలన మందు పంపిణీ చేస్తున్న అధికారులు

పెదపూడి: రైతులు సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టడం వల్ల అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయశాఖ కాకినాడ ఏడీఏ ఎం.రత్న ప్రశాంతి అన్నారు. దోమాడ, కరకుదురు గ్రామాల్లో మంగళవారం ఎలుకవల నిర్మూలనకు బ్రోమోడయోలిన్ మందును రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రత్నప్రశాంతి మాట్లాడుతూ రైతులందరూ ఎలుకల మందును బొరియల వద్ద ఒకేసారి పొట్లాటు కట్టి పెట్టాలన్నారు. దీంతో ఎలుకలు ఆ మందును తిని ఒకేసారి చనిపోతాయన్నారు.

కరకుదురు, దోమాడలో..

మండలంలో దోమాడ, కరకుదురు గ్రామాల్లో పొలంబడి నిర్వహించారు. వ్యవసాయశాఖ కాకినాడ ఏడీఏ ఎం.రత్న ప్రశాంతి, జిల్లా ఆత్మ పీడీ డైరెక్టర్ జ్యోతిర్మయి, మండల వ్యవసాయశాఖ అధికారి టీవీఆర్ మణిదీప్, విస్తరణ అధికారి ఎస్.సత్యనారాయణ హాజరై రైతులకు పలు సూచనలు ఇచ్చారు.

సేవ అమూల్యమైంది



సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అధ్యాపకులు మదీనాను సత్కరించిన సిబ్బంది



కళాశాల ప్రాంగణంలో మొక్కలను నాటుతున్న దృశ్యం

సీతానగరం: సేవ అనేది అమూల్యమైందని, ఇతరుల నుంచి ఏమి ఆశించకుండా ప్రేమతో చేసే ప్రతి చిన్న పని సేవ అవుతుందని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ సర్వీస్ స్కీమ్ ఫౌండేషన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ మహాత్మాగాంధీ, మదర్ థెరిసా వంటి ప్రేమమూర్తుల వ్యక్తిత్వాలను పరిశీలిస్తే సేవ అనే పదం అర్థమవుతుందన్నారు. కామర్స్ అధ్యాపకులు షేక్ దర్గా మదీనా, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ ఎం.సుధామయి తదితరులు ప్రసంగించారు. అనంతరం కామర్స్ అధ్యాపకులు మదీనాను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ మాదవ్, సుబ్బారావు, వాణి, మీనాక్షి, అలేఖ్య, వెంకటేష్, మనోహరి, రాజేశ్వరి, సురేష్ చంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

గైట్‌లో ఎన్ఎస్ఎస్ దినోత్సవం

రాజానగరం: విద్యాభ్యాసనతోపాటు ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా యువతకు దేశభక్తి, సమాజంపై సేవాభావం పెరుగుతుందని గైట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్ బాలు అన్నారు. ఇదే ఆశయంతో జాతీయ సేవ పథంను ప్రారంభించారన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో వలంటీర్లు మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాస్, పీఓ ఎం.అవినాష్ తదితరులు పాల్గొన్నారు.